
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు


5

బుధవారం 19 జూన్ 2024

ఊరి బడికి ఉరి

- జగన్ ప్రభుత్వంలో అశాస్త్రీయంగా 117 జీవో
- వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో 450 పాఠశాలలు విలీనం
- ప్రశ్నార్థకమైన ప్రాథమిక పాఠశాలల మనుగడ
- విలీనం కారణంగా పేదల పిల్లలు చదువుకు దూరం

'వైసీపీ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయం ఊరి బడికి ఉరిగా మారింది. అశాస్త్రీయమైన 117 జీవో 450కి పైగా ప్రాథమిక పాఠశాలల ఉసురు తీసింది. ఈ జీవో వల్ల ప్రాథమిక విద్యకు నష్టమని అటు ఉపాధ్యాయులు, ఇటు మేధావులు ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం ఆలకించలేదు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు బడికి దూరమవుతారన్న తల్లిదండ్రుల గోడును కూడా పట్టించుకోలేదు. విద్యావ్యవస్థను తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. అయితే ఎన్నికల ప్రచారంలో 117 జీవో రద్దుకు ఎన్డీయే కూటమి హామీ ఇచ్చింది. ఈ క్రమంలో వైసీపీ ఓటమిపాలవడం, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో జీవో 117 రద్దుతో పాటు విద్యావ్యవస్థలోని లోటుపాట్లను సరిచేస్తారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.'



కడప(ఎడ్యుకేషన్), జూన్ 18: వైసీపీ ప్రభుత్వం కొలువుదీరక ముందు.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక విద్య 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి పల్లెలోనూ, మూడు కి.మీ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలు, ఐదు కి.మీ పరిధిలో ఉన్నత పాఠశాలలు నడిచేవి. ఇవి పల్లెల్లోని విద్యార్థులకు చదువులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కానీ వైసీపీ ప్రభుత్వం విద్యాసంస్కరణల పేరుతో తెచ్చిన 117 జీవో ప్రాథమిక విద్యను నిట్టనిలువుగా చీల్చింది. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా సబ్జెక్టు నిపుణుల బోధన ఉండాలని, ఆంగ్ల విద్యను బలోపేతం చేయాలని విలీనవిధానాన్ని తీసుకువచ్చామంటూ.. ఒక కి.మీ పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాల్లో ప్రాథమిక విద్యకు చెందిన 3, 4, 5 తరగతులు విలీనం చేశారు. ఈ ప్రక్రియను నిరసిస్తూ పలు ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. జగన్ మొండిపట్టుతో గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుంచి దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చింది.

విలీన పాఠశాలల వివరాలు

- జిల్లాలో 407 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులు 275 ఉన్నత పాఠశాలల్లో విలీనం అయ్యాయి.
- 40 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులు 35 ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం అయ్యాయి.
- మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో గల 3, 4, 5 తరగతులు.. మూడు ఉన్నత పాఠశాలల్లో విలీనం అయ్యాయి. మొత్తంమీద జిల్లా వ్యాప్తంగా 450 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులు 313 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం అయ్యాయి.

విలీనంతో దుష్పరిణామాలు

పాఠశాలల విలీనంతో ప్రాథమిక విద్యలో దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్కూలు అసిస్టెంటు స్థాయి ఉపాధ్యాయులు బోధించడంలో విద్యాలక్ష్యాలు సాధించడంలో విఫలమయ్యారు. దీనికితోడు చిన్న పిల్లలు తమ ఊర్లో కాకుండా వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో డ్రాపౌట్స్ శాతం కూడా గణనీయంగా పెరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలను విధిలేని స్థితిలో ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

బోధనలో తికమక

సంస్కరణలు అంటే ఉన్నస్థాయి నుంచి ఉన్నతస్థాయికి వెళ్లాలి తప్ప తిరోగమనం చెందకూడదనే విషయాన్ని వైసీపీ ప్రభుత్వం మరిచినట్లయింది. సదరు ఉత్తర్వుల వల్ల ఉన్నత పాఠశాలలపై కూడా ప్రభావం చూపింది. ఉపాధ్యాయులపై తీవ్రమైన పనిభారం పెరగడం వల్ల ఉన్నత తరగతుల విద్యార్థులకు కూడా న్యాయం జరగలేదు. అంతేకాకుండా విద్యార్థుల నమోదు శాతం ఆధారంగా తీసుకుని 93 కంటే విద్యార్థులు తక్కువగా ఉంటే ప్రధానోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేశారు. అదే మాదిరిగా 137 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న విలీన ఉన్నత పాఠశాలల్లో సైతం వ్యాయామ, ప్రధానోపాధ్యాయ పోస్టులను రద్దు చేశారు. దీంతో సదరు పాఠశాలల్లో ఉన్నత విద్య నిర్వీర్యమైందని చెప్పాలి. పీజీ, బీఈడీ స్థాయి అర్హతలున్నా స్కూలు అసిస్టెంటు ఉపాధ్యాయులు 3, 4, 5 తరగతులకు బోధించడంలో తికమకకు గురి కావడం వల్ల విద్యా ప్రమాణాల్లో అనుకున్న లక్ష్యాలను చేరుకోలేక పోయారు.

జీవో 117 రద్దు చేయాలి

జీవో 117 రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలని, ఊరి బడుల్లోనే ప్రాథమిక విద్య పూర్తి చేసేటట్లు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు నిరసన కార్యక్రమాలు చేసినా, తల్లిదండ్రులు సైతం రోడ్డుమీదకు వచ్చినా గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం వచ్చింది. జీవో 117ను రద్దు చేస్తామని ప్రాథమిక విద్యను కాపాడుతామని ఎన్డీయే నేతలు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో జీవో 117 రద్దు చేసి ప్రాథమిక విద్య ఐదో తరగతి వరకు ఒకేచోట ఉండేలా చర్యలు చేపట్టాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. దీంతో డ్రాపవుట్స్ సంఖ్య తగ్గడంతో పాటు విద్యార్థి సొంత ఊరి నుంచే విద్యాభ్యాసం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఊరి బడికి విద్యార్థులు దూరం

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో జిల్లాలో వేల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. మరికొంత మంది విద్యార్థులు డ్రాపవుట్స్‌గా మారారు. వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులకు కోత పడింది. లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూత వేయాల్సిన దుస్థితి. జీవో 117తో ఊరిబడికి ఉరి వేయవద్దని ఉపాధ్యాయ సంఘాలు నెత్తీ నోరు బాదుకున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. జిల్లాలో 450కి పైగా ప్రాథమిక పాఠశాలలు విలీనం అయ్యాయి. సాధారణంగా 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థులు పదేళ్లలోపే ఉంటారు. వీరంతా సుదూరంగా ఉండే ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పిల్లలను తల్లిందండ్రులు తమకు అందుబాటులో ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం ప్రారంభించారు. 1, 2 తరగతులున్న ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులను చేర్పించేవారు లేక అవి క్రమంగా నిర్వీర్యమయ్యే స్థాయికి వచ్చాయి. అలాగే ఉపాధ్యాయ పోస్టులు కూడా తగ్గాయి.

ఉన్న ఊరిలోనే ప్రాథమిక విద్య చదివేలా ఉండాలి

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

విద్యార్థులు ఉన్న ఊరిలోని పాఠశాలల్లోనే ప్రాథమిక విద్య చదివేలా ఉండాలి. ఐదో తరగతి వరకు చదివేలా ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలి. విలీనం విధానానికి స్వస్తి పలకాలి. జీవో 117లో ఉన్న అభ్యంతరాలను కొత్త ప్రభుత్వం పరిశీలించాలి. కొత్త విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లోనే 3, 4, 5 తరగతులు కొనసాగించాలి. సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. ప్రాథమిక పాఠశాలల్లో టీటీసీ స్థాయి ఉపాధ్యాయులే బోధించేలా చర్యలు చేపట్టాలి.



రాజుపాలెం మండలంలో ఏడుగురు మాత్రమే విద్యార్థులు ఉన్న ఎంపీపీ స్కూలు

వారిద్దరూ డబ్బులు వసూలు చేశారు

- పోలీసు అధికారులపై ఆరోపణ..!
- కడప నగరంలో కరపత్రాల కలకలం



కడప (క్రైం), జూన్ 18: కడప నగరంలోని ఓ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో ఇద్దరు అధికారులు డబ్బులు వసూలు చేసి పంచుకున్నారంటూ వేసిన కరపత్రాలు కలకలం రేపుతున్నాయి. అధికారుల పేర్లు పెట్టి మరీవేసిన ఈ కరపత్రాలు కడప నగరంలో సంచలనంగా మారాయి. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నేతల నుంచి లక్షల్లో వసూలు చేశారంటూ ఆ కరపత్రాల్లో ఆరోపించారు. వీటిని స్టేషన్ పరిధిలోనే కాకుండా రాత్రి సమయంలో నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో చల్లుకుంటూ వెళ్లినట్లు తెలుస్తోంది. ఇద్దరు అధికారులు డబ్బు వసూలు చేసి వారిద్దరే పంచుకున్నారని, కిందిస్థాయి సిబ్బంది ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నారని ముద్రించడం గమనార్హం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. ఎన్నికలు ముగిసి నూతన ప్రభుత్వం ప్రమాణస్వీకారం అనంతరం కరపత్రాలు ముద్రించడం అటు పోలీసు వర్గాలు ఇటు ప్రజల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సంఘటన ఇంటి దొంగల పనా లేక ఎవరైనా బయట వ్యక్తులు చేశారా అన్న కోణంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది.

ట్రిపుల్‌ఐటీలో సీట్లకు 50,106 దరఖాస్తులు

- దరఖాస్తుకు 25 వరకు గడువు
- 11న ఎంపిక జాబితా విడుదల

వేంపల్లె, జూన్ 18: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సమీకృత ఇంజనీరింగ్ కోర్సులకు ఇప్పటి వరకు 50,106 దరఖాస్తులు వచ్చాయి. ఈ యేడాది 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. గత నెల చివరి వారంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్జీయూకేటీ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో చేరేందుకు ఇప్పటికి 50,106 దరఖాస్తులు వచ్చాయి. ఇక వారం రోజులే గడువు ఉంది. ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. 4,400 సీట్లకు గాను గత ఏడాది 40వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటికే అదనంగా 10వేల దరఖాస్తులు వచ్చాయని ఆర్జీయూకేటీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా జూలై 11న ఎంపిక జాబితా విడుదల చేయనున్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తప్పవు : డీఈఓ

కడప (ఎడ్యుకేషన్), జూన్ 18: జిల్లాలో ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలలు నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తప్పవని డీఈవో అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఫీజు వివరాలు పాఠశాల నోటీసు బోర్డులో తరగతుల వారీగా తప్పనిసరిగా తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేసి విద్యార్థులకు సరఫరా చేయాలని వివరించారు. గుర్తింపు లేకుండా పాఠశాలలు నడపకూడదని, ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలు పాటించేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 18: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలో 54 శాతం మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాకు రాష్ట్రంలో 18వ స్థానం లభించింది. జిల్లా వ్యాప్తంగా 4,759 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2,592 మంది (54శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లాకు రాష్ట్రంలో 18వ స్థానం లభించిందని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు.

రైతు చల్లగా ఉంటేనే.. రాజ్యం సుభిక్షం

- పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు రూ.37.328 కోట్లు విడుదల
- కలెక్టర్ విజయరామరాజు



రైతులకు పీఎం కిసాన్ మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే ఆర్.మాధవి తదితరులు

కడప(ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 18: రైతు చల్లగా ఉంటేనే.. రాజ్యం సుభిక్షంగా ఉంటుందని విశ్వసించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతకు అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలిచాయని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వారణాసి బహిరంగసభ నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ 17వ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమానికి కడప నగర శివారులోని కృషి విజ్ఞానకేంద్రంలో కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి హాజరయ్యారు. మోదీ ప్రసంగం ముగిసిన అనంతరం 17వ విడత జిల్లా వ్యాప్తంగా 1,86,640 మంది లబ్ధిదారులైన రైతులకు రూ.37.328 కోట్ల మెగా చెక్కును అతిథుల చేతుల మీదుగా అందించారు. అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయంలో కృషి శక్తి కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాదిలో మూడు విడతలుగా రూ.2వేల చొప్పున పంపిణీ చేసే పీఎం కిసాన్ సమ్మాన్ సాయం రైతులకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్న కొద్దిపాటి స్థలంలో కూడా ఇంటి పరిసరాల్లోనే కిచెన్ గార్డెన్లను పెంచుకోవాలన్నారు. ప్రకృతి సాగువైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. మహిళా రైతులకు డీఆర్‌డీఏ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతు సంతోషంగా ఉండాలని భావించిన ప్రధాని మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వర్‌రావు, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, సురేశ్‌బాబు, సెర్ఫ్ డైరెక్టరు, కేవీకే శాస్త్రవేత్త వీరయ్య, ఆదర్శ రైతు శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనాథలా అన్నమయ్య ప్రాజెక్టు



పునర్నిర్మాణానికి నోచుకోని అన్నమయ్య ప్రాజెక్టు

- సిబ్బందికి మాత్రం ఏటా రూ.3కోట్ల జీతాలు
- పనులు జరగాల్సిన ప్రాజెక్టు ప్రాంతంలో ఉండకుండా.. కడపలోనే తిష్ట
- వైఎస్ జగన్ పాలన మార్కుతో.. కార్యాలయం కడపలోనే కొనసాగింపు
- శిథిలావస్థలో రాజంపేటలోని అన్నమయ్య ప్రాజెక్టు భవనాలు

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి వందలాది కుటుంబాలకు శాపంగా మారితే.. ప్రాజెక్టులో పనిచేసే సిబ్బందికి మాత్రంగా వరంగా మారింది. ప్రాజెక్టు పునర్నిర్మిస్తుంటే సిబ్బంది క్షేత్రస్థాయిలో నివాసం ఉండి పనిచేయాల్సి ఉంది. అయితే కడపలో ఉంటూ.. ప్రాజెక్టు పని చేయకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేస్తూ లక్షల్లో జీతాలు పొందుతున్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి అనాథలా మారి రెండున్నరేళ్లు అవుతున్నా అక్కడ ఒక్క పని కూడా జరగలేదు. సిబ్బంది మాత్రం నెలకు రూ.25 లక్షలకు తగ్గకుండా ఏకంగా యేడాదికి రూ.3 కోట్లు జీతాలు తీసుకుంటూ.. కడపలో ఉండడంపై నూతన ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది.

రాజంపేట, జూన్ 17: ఇరవై ఏళ్ల కిందట అన్నమయ్య ప్రాజెక్టును ప్రారంభించే నాటికి ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలోనే సబ్‌డివిజన్ కార్యాలయాలు నాటి ఉమ్మడి కడప జిల్లా కేంద్రంలో ఈఈ కార్యాలయం, రాజంపేట హెడ్‌క్వార్టర్‌లో మరో సబ్‌డివిజన్ కార్యాలయం ఉండేవి. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సిబ్బందికి పనిలేకుండా పోయింది. ప్రాజెక్టు నిర్వహణ, కాలువల నిర్వహణ మాత్రమే ఉండేది. ప్రాజెక్టు పరిపాలన వ్యవహారాలను చూసుకోవడానికి సిబ్బంది ఉండేవారు. అయితే 2021 నవంబరులో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయింది. దీంతో ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో ఉన్న సబ్‌డివిజన్ కార్యాలయాలు వరదలో కొట్టుకుపోయాయి. ఇది ఇక్కడి సిబ్బందికి బాగా కలిసి వచ్చింది. రాజంపేట హెడ్‌క్వార్టర్‌లోని ఆర్‌అండ్‌బీ ప్రాంగణంలో ఒక సబ్‌డివిజన్ కార్యాలయం ఉండేది. ఆ కార్యాలయాన్ని కూడా మూసివేశారు. దీంతో అక్కడి సిబ్బంది కూడా కడపలో మకాం వేసి ఎంచక్కా తమ సొంత పనులు చూసుకోవడం ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ ప్రాంగణంలో అన్నమయ్య ప్రాజెక్టు గతంలో ఉన్న సబ్‌డివిజన్ కార్యాలయం భవనంతో పాటు తెలుగుగంగ ప్రాజెక్టు సబ్‌డివిజన్ కార్యాలయం భవనం కూడా ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు కార్యాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. అతి తక్కువ ఖర్చుతో వీటికి మరమ్మతులు చేసుకుంటే సిబ్బంది అంతా ఇక్కడ ఉండవచ్చు. అయితే అది కాదని.. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పేరుతో ఈఈ కార్యాలయంతో పాటు ఇక్కడ పనిచేసే సిబ్బంది మొత్తం కడపలోనే గత వైసీపీ పాలకుల కొమ్ముకాస్తూ కాలం గడపడం గమనార్హం.

అన్నమయ్య ప్రాజెక్టు ఉద్యోగుల వివరాలిలా..

అన్నమయ్య ప్రాజెక్టులో ఈఈ స్థాయి అధికారితో పాటు నాలుగు సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు ఉన్నందున పరిపాలన ఈఈ కార్యాలయం కడపలోని ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలోనే అనేక ఏళ్లుగా ఉంది. రాజంపేట ఆర్‌అండ్‌బీ ప్రాంగణంలో అన్నమయ్య ప్రాజెక్టు సబ్‌డివిజన్ 4వ కార్యాలయం ఓ డివిజనల్ స్థాయి అధికారితో ఉండేది. ప్రాజెక్టు ప్రాంగణంలో 2, 3 సబ్‌డివిజన్ కార్యాలయాలు ఉండేవి. కడపలోని ఈఈ కార్యాలయ ప్రాంగణంలో ఒకటో సబ్‌డివిజన్ కార్యాలయం కూడా ఉండేది. కడపలో పరిపాలన వ్యవహారాలు చూసే కార్యాలయం ఉండగా మిగిలిన మూడు సబ్‌డివిజన్ కార్యాలయాల సిబ్బంది ప్రాజెక్టు క్షేత్రస్థాయి పనుల్లో ఉండేవారు. ఒక్కో సబ్‌డివిజన్‌లో ఒక డీఈతో పాటు ఏఈలు, టెక్నికల్ సిబ్బంది, క్లర్కులు, అటెండర్లు ఉండేవారు. ఒక్కో ఆఫీసులో ఐదుగురు చొప్పున 4 సబ్‌డివిజన్ కార్యాలయాల్లో 20 మంది సిబ్బంది ఉన్నారు. ఇక ఈఈ కార్యాలయంలో 10 మంది సిబ్బంది ఉన్నారు. అంటే ఒక ఈఈతో పాటు నలుగురు డీఈలు, నలుగురు ఈఈలు సుమారు 12 మంది పైబడి ఏఈలు, ఇతర సిబ్బంది కలుపుకుని 30 మంది పైబడి సిబ్బంది ఇక్కడున్నారు. ఈఈ స్థాయి అధికారికి సుమారు రూ.2 లక్షలు, డీఈ స్థాయి అధికారికి ఒకటిన్నర లక్ష, ఏఈ స్థాయి అధికారికి సుమారు లక్ష రూపాయలు, క్లర్కులు, ఇతర సిబ్బందికి సుమారు రూ.50 వేల నుంచి రూ.80 వేల జీతాలు అందుతున్నాయి. అంటే 30 మంది సిబ్బందికి నెలకు 25 లక్షల రూపాయలు జీతం తీసుకుంటున్నారు. ఏడాదికి రూ.3 కోట్ల జీతం వీరికి అందుతుంది.

వైసీపీ నాయకుల అండతో కడపలోనే మకాం

గత వైసీపీ పాలకుల అండతోనే ఈ తతంగమంతా జరుగుతోంది. కేవలం 22,500 ఎకరాల ఆయకట్టు కలిగిన 2.23 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన ఈ మధ్యతరహా ప్రాజెక్టును కేవలం రూ.65 కోట్లతో పూర్తి చేస్తే.. జగన్ ప్రభుత్వ హయాంలో ఎస్టిమేట్‌లను రకరకాలుగా పెంచి ఏకంగా రూ.800 కోట్లు ఖర్చు కానున్నట్లు వెల్లడించారు. కాలువలు, గేట్లు, ఎర్త్‌డ్యాం పేరిట ఇలా ఎన్నో రకాల అంచనాలను తయారుచేయించి సుమారు రూ.760 కోట్లకు పైబడి నిధులకు టెండర్లు కూడా పిలించారు. పనులు జరిగే సమయంలో కాంట్రాక్టర్ల వద్ద నుంచి కోట్లు దండుకోవడానికి ఈ సిబ్బందిని వైసీపీ పెద్దలు పావుగా ఎంచుకున్నారు. దీంతో ఈ సిబ్బందిని కడపలో ఉంచుకుని వారికి అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించిన ఎటువంటి పనులు చెప్పకుండా ఇతర మండలాల్లో చెరువుల నిర్వహణ పేరిట నియామకాలు వేయించుకున్నారు. వీరిలో ప్రధాన అధికారుల నుంచి తప్పుడు ఎస్టిమేట్‌లు వేయించుకుని కోట్లు గడించడానికి వీరిని కడపలోనే ఉంచారు. ఒక ఏఈ స్థాయి అధికారి కడపలోని ఇతర ఇరిగేషన్ శాఖలను నిర్వర్తిస్తూ ఏకంగా అన్నమయ్య ప్రాజెక్టు ఏఈగా చేరి డొంకదారిలో సబ్‌డివిజన్ అధికారిగా చెలామణి అవుతూ వైసీపీ పాలకులకు అనుచరునిగా మారి వారు చెప్పింది చేస్తూ అక్కడే మకాం వేశారు. రాజంపేటలో ఉండాల్సిన సబ్‌డివిజన్ కార్యాలయాన్ని కడపలోనే ఒక చిన్నపాటి గదిలో ఏర్పాటు చేసి పనిలేని పనికి అక్కడే సిబ్బందిని ఏర్పాటు చేసుకుని తన సొంత పనులు చూసుకునేవారు. ఈ విషయాన్ని గమనించిన నూతన ప్రభుత్వం కన్నెర్ర చేయడంతో ఆ ఏఈని అన్నమయ్య ప్రాజెక్టు విధుల నుంచి తొలగించడంతో ఈ విషయం మొత్తం బట్టబయలైంది.

కొత్త జిల్లాలు ఏర్పడినా...

గత జగన్ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అన్నమయ్య ప్రాజెక్టును అదే జిల్లాలోకి మారింది. అన్నమయ్య జిల్లా ఏర్పడి రాయచోటి జిల్లా కేంద్రమైనా అన్నమయ్య ప్రాజెక్టు కార్యాలయాన్ని మాత్రం మార్చలేదు. కారణం ప్రాజెక్టులో అనేక డిజైన్ల పేరిట కార్యాలయ భవనం అక్కడే ఉంది. ఈఈ కార్యాలయంతో పాటు 4 సబ్‌డివిజన్ కార్యాలయాల సిబ్బంది మొత్తం అక్కడే ఉంటున్నారు. కొత్త జిల్లాకు కార్యాలయం ఎందుకు మారలేదో అంతుబట్టని అంశం.

ప్రాజెక్టు పునర్నిర్మిస్తే సిబ్బంది ఎక్కడ ఉండాలి

అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తున్నామని ఇందుకు టెండర్లు కూడా పూర్తి చేశామని, ప్రాజెక్టు డిజైన్‌లు కూడా పూర్తయ్యాయని, వెంటనే పనులు జరుగుతున్నాయని స్వయంగా గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో ప్రకటించారు. మరి ప్రాజెక్టు పనులు ఇంత పెద్దఎత్తున ప్రారంభిస్తుంటే సిబ్బంది ఎక్కడ ఉండాలి. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలో కచ్చితంగా ఉండి తీరాలి. ప్రస్తుతం ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలో అతిథి గృహం పేరిట పెద్ద భవనం ఉంది. ప్రాజెక్టు సమీపంలోని ఆకేపాడు ప్రాంతంలో బాడుగకు లభించే అనేక భవనాలు ఉన్నాయి. ఇక ప్రాజెక్టు సమీపంలోని రాజంపేట ప్రాంతంలో గతంలో సబ్‌డివిజన్ కార్యాలయ భవనాలకు చిన్న చిన్న మరమ్మతులు చేస్తే అక్కడే ఉండే సౌలభ్యం ఉంది. ఇవన్నీ కాదని వీరంతా కడపలోనే ఉండడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. నూతన ప్రభుత్వ పాలకులు ఈ విషయంపై దృష్టి సారించడంతో అన్నమయ్య ప్రాజెక్టు సిబ్బంది వ్యవహారం నేడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయమై అన్నమయ్య ప్రాజెక్టు ఈఈ హరికిరణ్‌ను వివరణ కోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



రాజంపేటలో ఉండాల్సిన సబ్‌డివిజన్ కార్యాలయాన్ని కడపలో కొనసాగిస్తున్న ఓ అధికారి అనధికార కార్యాలయం

విద్యుదాఘాతంతో అరటి రైతు మృతి



రైల్వేకోడూరు, జూన్ 18: బొజ్జావారిపల్లె అరటి తోటకు నీరు పారగట్టేందుకు పొలానికి వెళ్లిన బుర్రా జనార్థన్ (47)కాలికి విద్యుత్ తీగ కాలికి అక్కడికి అక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రైతు జనార్థన్‌కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో అరటి తోట వేశాడు. తోటకు నీరు పారగట్టేందుకు తన పొలంలో వెళుతుండగా విద్యుత్ తీగ కాలికి తగిలి అక్కడికి అక్కడే కుప్పకూలాడు. కాగా జనార్థన్ తల్లి జానకమ్మ కుమారుడికి భోజనం తీసుకుని పొలం దగ్గరకు వెళ్లింది. అక్కడ పడి ఉన్న జనార్థన్‌ను చూసి కేకలు పెట్టింది. పక్కనే ఉన్న రైతులు, స్థానికులు వచ్చారు. రైతును తీసుకుని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జనార్థన్ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సంపూర్ణమ్మ, కుమారుడు రవి, కుమార్తె రవిత్రి ఉన్నారు. శవ పరీక్షల కోసం కోడూరు ఆస్పత్రిలో ఉంచారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ ప్రమాదం ఎలా జరిగిందని విద్యుత్ అధికారులు ఆరా తీశారు. జనార్థన్ మృతితో బొజ్జావారిపల్లె గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యులు మాకు ఎవరు దిక్కు అని విలపించారు.

లారీ, బైకు ఢీ - ఒకరు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రమణయ్య

రాజంపేట టౌన్, జూన్ 18: ఊటుకూరు అశోక్‌గార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణయ్య (45) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే పుల్లంపేట మండలం బావికాడపల్లె రైతు రమణయ్య, మణి ఇద్దరూ పనుల నిమిత్తం పుల్లంపేట నుంచి రాజంపేటకు వస్తుండగా రాజంపేట శివారు ప్రాంతం అశోక్‌గార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జు నుజ్జు కాగా రమణయ్య తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రమణయ్య మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గాయపడిన మణిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట రూరల్ సీఐ రవీంద్రనాథ్ తెలిపారు.

కాశినాయన గుడివద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



సిద్దవటం, జూన్ 18: కడప - చెన్నై జాతీయ రహదారి పెద్దపల్లె పంచాయతీ శివునిపల్లె సమీప కాశినాయన గుడివద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో పంచాయతీ కార్యదర్శి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

వేంపల్లెలో యువకుల బాహాబాహీ

పోలీస్‌స్టేషన్‌కు తరలింపు ● భయాందోళనల్లో ప్రజలు



వేంపల్లె బజారులో గుమిగూడిన జనం

వేంపల్లె, జూన్ 18: స్థానిక మెయిన్ బజార్‌లో రెండు వర్గాల యువకులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. క్రికెట్ ఆటపై జరిగిన వాదోపవాదాలు పెరిగి మెయిన్ బజార్‌లో కొట్టుకునే స్థాయికి వచ్చింది. రెండువర్గాలు తలపడడంతో భయానక వాతావరణం కనిపించింది. స్థానికులు విడిపించిన మళ్లీ కొద్దిసేపటికి బజారులో గుంపులుగా రావడంతో అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు బజారులోకి చేరుకుని మందలించారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు చేసుకుం టూ బ్యాచ్‌లుగా యువకులు సంచరిస్తుండడంతో సానికుల్లో భయాందోళన నెలకొంది. పోలీసులు అంటే భయం లేకుండా బాహాటంగా తిరుగుతున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి బ్యాచ్‌లను అదుపు చేయకుంటే భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలు చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబుల వీరంగం - ఒకరికి గాయాలు

బద్వేలుటౌన్, జూన్ 18: మైదుకూరు రోడ్డులోని ఎన్ఎంఎస్ కల్యాణ మండ పం వద్ద మందుబాబులు వీరంగం సృష్టించి సీసాలతో దాడి చేసుకోవడం తో సురేంద్రనగర్ వాసి రామచంద్రకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... ఇద్దరు యువకులు ఎన్ఎంఎస్ కల్యా ణ మండపం సమీప వెంచర్‌లో మ ద్యం తాగుతుండగా మరో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంలో వచ్చి దుర్భాష లాడారు. దీంతో మాటామాటా పెరిగి బీరు సీసాలతో దాడిచేయడంతో ముగ్గురు యు వకులు ఒక్కసారిగా రామచంద్రపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. చుట్టుపక్కల యువకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రామచంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లుపై ఆకస్మిక తనిఖీ



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం)/ముద్దనూరు, జూన్ 18: కడప విజిలెన్స్ అధికారులు రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కడప రీజనల్ విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ, తూనికలు, కొలతలు, అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులు సంయుక్తంగా ముద్దనూరు మండలం, తాడిపత్రి రోడ్డులోని శ్రీగురు ఆంజనేయ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని బియ్యం, వడ్లు భౌతిక నిల్వలు, రికార్డులను పరిశీలించారు. వేయింగ్ మెషిన్ స్టాంపింగ్ లేనందుకు తూనికలు కొలతలశాఖ చట్టం ప్రకారం రూ.25వేలు అపరాద రుసుం విధించారు. రికార్డులు సక్రమంగా లేనందు వల్ల జీఎస్టీ యాక్ట్ 2017 ప్రకారం రూ.50వేలు అపరాద రుసుం విధించినట్లు వారు తెలిపారు. కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి షేక్‌మాసుం బాష ఆదేశాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారులు శ్రీనివాసులు, అసిస్టెంట్ జియాలజిస్ట్ మురళీక్రిష్ణ, ఖాజాహుసేన్, గీతావాణి, బాబుమోసెస్, అర్జున్‌రావు, తారకనాథరెడ్డి పాల్గొన్నారు.

భాష్యం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు సీజ్



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: నిబంధనలకు విరుద్ధంగా భాష్యం పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తుండడంతో ఎంఈఓ సావిత్రమ్మ పాఠ్యపుస్తకాలను సీజ్ చేశారు. ఆర్ఎస్‌యూ (రాయలసీమ స్టూడెంట్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి విక్రయిస్తున్నారని చర్యలు తీసుకోవాలని డీఈఓ అనూరాధకు ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ సావిత్రమ్మ మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. గదిలో ఉన్న పాఠ్యపుస్తకాలను పరిశీలించి పాఠశాలలో విక్రయించరాదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాలు విక్రయించడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారు తగిన చర్యలు తీసుకుంటారన్నారు.

నిబంధనలు పాటించాలి : డిప్యూటీ డీఈఓ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

సింహాద్రిపురం, జూన్ 18: ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప సూచించారు. మంగళవారం సింహాద్రిపురంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో గాలి, వెలుతురు, టాయిలెట్లు, క్రీడా మైదానం తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే పాఠశాలను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బలవంతంగా సంతకం చేయించారు

కౌన్సిలర్ల తర్వాతే నేను చేశాను : చైర్‌పర్సన్ శివమ్మ ● లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వాలి ● నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు, జూన్ 18: నగర పంచాయతీ పరిధి కూరగాయల మార్కెట్ టెండర్లు రద్దు చేసినా అప్పటి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కౌన్సిలర్లతో బలవంతంగా సంతకాలు చేయించి చివరగా నాతో సంతకం చేయించారని మున్సిపల్ చైర్‌పర్సన్ శివమ్మ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో 4వ వార్డు కౌన్సిలర్ జ్ఞాన ప్రసూన మృతి పట్ల ఆమె ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో తొమ్మిది అంశాలతో కూడిన అజెండాను ఒక ఉద్యోగి చదివి వినిపించారు. అందులో 9వ అంశంపై మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు ఎంత మంది ఉన్నారు, బడ్జెట్ ఎంత ఉందని కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే అడిగారు. మూడేళ్ల నుంచీ నగర పంచాయతీలో అభివృద్ధి చేయలేని వారు అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే అన్నారు. 12 నెలలకు పారిశుద్ధ్య కార్మికులకు మూడు కోట్ల రూపాయలు జీతాల కింద ఖర్చయితే మున్సిపాలిటీ ఎలా అభివృద్ధి అవుతుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల జీతాలను జనరల్ ఫండ్‌లో కాకుండా ప్రభుత్వం డబ్బు జీతాలకు ఇచ్చేలాగున వైసీపీలో చేసిన జీఓను రద్దు చేస్తామన్నారు. అప్పుడే అభివృద్ధి కోసం నిధులు మున్సిపాలిటీకి ఉపయోగపడతాయన్నారు. వైస్‌చైర్మన్-2 సింగరయ్య మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఇలాంటి మీటింగ్ జరగలేదని, అప్పుడు అడగకుండా ఇప్పుడు సంతకాలు, మార్కెట్ టెండర్లపై అంతా అడుగుతున్నారన్నారు. వెంటనే కౌన్సిలర్లు ముల్లాజానీ, మునిసుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి అభివృద్ధి సమావేశం నిర్వహించాలన్నా పెట్టడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్లకు ఎలాంటి గౌరవం లేకుండా పోయిందని, కౌన్సిలర్లను పిలవడం లేదన్నారు. మార్కెట్ టెండర్లను కౌన్సిల్ సమావేశంలో తిరస్కరిస్తే ఒత్తిడి చేసి అవే టెండర్లను తిరిగి కౌన్సిలర్లతో సంతకాలు చేయించుకుని ఏర్పాటు చేశారన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలు అడగకుండా అప్పటి ఎమ్మెల్యే, అధికారులు పనిచేశారని, టీ, కాఫీలు ఇవ్వడమే తప్ప అభివృద్ధిపై అడిగేందుకు కూడా సమయం ఇచ్చేవారు కాదన్నారు. కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి మాట్లాడుతూ టిడ్కో గృహాలు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పీఏ అమర్‌నాథ్ రెడ్డి పేరుతో ప్రతి పనిలో అజెండాలో పేరు చేర్చుకుని ఎలాంటి పని చేయకపోయినా బిల్లులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై అధికారులు నివేదిక తయారు చేయాలని, అసెంబ్లీ తర్వాత వీధి వీధీ తిరిగి కఠిన చర్యలు తీసుకుంటామని, అవినీతి అక్రమాలపై తాట తీస్తామన్నారు. ఎవరు తప్పు చేసినా వదిలే ప్రసక్తే లేదన్నారు. మున్సిపాలిటీ స్థలాలు ఆక్రమణ జరిగాయని, వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. జగనన్న కాలనీల్లో మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా నీటి సమస్యలు కరెంటు, విద్యుత్తు వీధి దీపాల సమస్యలు ఉండరాదన్నారు. పారిశుధ్యం, డ్రైనేజీ శుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్, సిబ్బందికి ఎమ్మెల్యే హెచ్చరించారు. సీజ్ చేసిన వాటర్‌ప్లాంట్ల సమస్యలు త్వరగా పరిష్కరించాలని, కరెంటు బిల్లుల పెండింగ్ అధికారులతో మాట్లాడి సంబంధిత యజమానులతో కట్టించాలని కమిషనర్‌ను, విద్యుత్తు, హౌసింగ్ సిబ్బందిని ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లోని విద్యాశాఖ తదితర శాఖల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'ఇసుక దోపిడీని అడ్డుకుంటాం'

జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని నీటి సమస్య లేకుండా గట్టి చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయ చైర్‌పర్సన్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ నిరుపయోగంగా మారిన పురాతన రిపబ్లిక్ క్లబ్‌ను ఉచిత వైద్యశిబిరాలకు వినియోగిస్తామన్నారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా చేస్తామంటే ఒప్పుకోమన్నారు. స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుకను వినియోగించుకోవచ్చన్నారు. బయటి ప్రాంతాలకు తరలించి ఇసుకను అమ్ముకుంటామంటే ఒప్పుకునేది లేదన్నారు. దక్షిణ భాగంలో బైపాస్ రోడ్డుకు సంబంధించి ఆర్డీఓ శ్రీనివాసులుతో తాను మాట్లాడానని, భూసేకరణ వెంటనే జరగాలని చెప్పామన్నారు. నియోజకవర్గానికి స్టీల్‌ప్లాంట్ రావాల్సిందేనని, గండికోట టూరిజం అభివృద్ధి వేగంగా జరగాలన్నారు. ఏసీసీ సిమెంటు కూడా మైలవరానికి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు, అమరావతి, వైజాగ్, డబుల్ ఇంజన్ సర్కార్‌లో అభివృద్ధి జరుగుతుందన్నారు.

అన్నా క్యాంటీన్ల పునర్జీవంపై హర్షం

బద్వేలుటౌన్, జూన్ 18: టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే అన్నాక్యాంటీన్ల పునర్జీవంపై పలువురు నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అన్నాక్యాంటీన్లను పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 4వ సంతకం చేసి పేదల ఆకలినితీర్చే మంచిపనికి శ్రీకారం చుట్టారని సామాన్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే సామాన్య ప్రజలకు, పట్టణాల్లో ఉండే పేదలకు రూ.5కే టిఫెన్, భోజనం అందించాలనే మహోన్నత ఆశయంతో టీడీపీ ప్రభుత్వం గతంలో అన్నాక్యాంటీన్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే పట్టణంలోని జాతీయ రహదారి మైదుకూరురోడ్డు నాలుగురోడ్ల కూడలి సమీపంలో పేదప్రజల ఆకలిని తీర్చాలనే లక్ష్యంతో అన్నాక్యాంటీన్లను ఏర్పాటు చేశారు. చంద్రబాబు ఆలోచనతో రోజూ వందల మంది పేదల ఆకలి తీర్చేవారు. అన్నాక్యాంటీన్‌లో రూ.5 ఇస్తే వేడివేడిగా శుభ్రంగా భోజనం అందేది. అయితే వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ కక్షతో పేదలకు పెట్టే పట్టెడన్నాన్ని జీర్ణించుకోలేక జగన్ ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్లను నిర్లక్ష్యంగా మూసివేయించారు. అయితే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అన్నాక్యాంటీన్లను పునఃప్రారంభించాలని, వందరోజుల్లో ప్రణాళికలను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీచేశారు. రోజూ ఆహారం కోసం వచ్చి కడుపు నింపుకొంటున్న నిరుపేదలు వైసీపీ ప్రభుత్వంలో ఉసూరుమంటూ వెనుతిరిగేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అరాచకపాలనను ప్రజలు శాశ్వతంగా ఇంటికి పంపించడంతో ప్రజల కూటమి ప్రభుత్వం పేదల ఆకలినితీర్చే చంద్రబాబు పాలనకు స్వాగతం పలకడంతో అన్నాక్యాంటీన్లకు నూతన కళచేకూరనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేప ట్టిన చంద్రబాబు అన్నా క్యాంటీన్ల సేవను పునః ప్రారంభించేందుకు సంత కంచేసి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ప్రజ ల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



నిరుపయోగంగా ఉన్న అన్నాక్యాంటీన్ భవనం

నిరుపేదలకు ఆకలి తీరుతుంది



నిరుపేదల ఆకలినితీర్చే అన్నా క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ ప్రారంభించేందుకు ఆదేశాలు జారీచేయడం అభినందనీయం. పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే గ్రామీణులు అన్నాక్యాంటీన్లలో భోజనం చేసి వెళ్లేవారు. ఇప్పుడు రూ.70 నుంచి రూ.100 పెట్టి తినాలంటే కష్టంగా ఉంది. చంద్రబాబు అన్నాక్యాంటీన్లను ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం సంతోషం

లక్షుమయ్య, కూరగాయల వ్యాపారి, బద్వేలు

పేదల ఆకలినితీర్చే అన్నాక్యాంటీన్లు



ఎందరో పేదల కడుపునింపి ఆకలినితీర్చే అన్నాక్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నారంటే ఆనందంగా ఉంది. ఇది ఎంతో మంచి నిర్ణయం. చిన్న చిన్న పనుల నమిత్తం పట్టణాలకు వచ్చి, జీవనం సాగించేవారి కోసం అన్నా క్యాంటీన్లలో రూ.5లకే కడుపునిండా భోజనం పెట్టడం సంతోషకరం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం

జార్జి, ఎర్రపాలెం

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

టీడీపీ యువనేత యాపరాల చిన్న చేదోడు



చిన్నారులకు రూ.50 వేలు ఇస్తున్న యాపరాల చిన్న

మైదుకూరు రూరల్ జూన్ 18: ఒకే నెలలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు టీడీపీ యువనేత, న్యాయవాది యాపరాల చిన్న యాభై వేల రూపాయల ఆర్థిక సాయం అందించాడు. 'ఒకే నెలలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు' ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పాతూరు టీడీపీ యువనేత, న్యాయవాది యాపరాల చిన్న స్పందించారు. అంతేకాకుండా చిన్నారులకు ఇంకా ఎలాంటి సాయం కావాల్సివచ్చినా అడగ వచ్చని తెలిపారు. పాతూరులోని పలువురు మహిళలు ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేస్తున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్ - నగలు స్వాధీనం



చైన్‌స్నాచర్‌తో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం

రాయచోటిటౌన్, జూన్18: స్థానిక కొత్తపేట, చెక్‌పోస్టు శివాలయం తదితర ప్రాంతాల్లో మహిళల మెడలో బంగారు గొలుసులను చోరీ చేసిన దొంగను మంగళవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి 66 గ్రాముల మూడు బంగారు చైన్లు స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే... కొత్తపల్లె ప్రాంతీయుడు కరీంసాబ్ కుమారుడు షేక్. మహమ్మద్‌మోసిన్ ఈ నెల 9, 10వ తేదీల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహిళల మెడలో గొలుసులను చోరీ చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన రాయచోటి అర్బన్ పోలీసులు మంగళవారం షేక్. మహమ్మద్ మోసిన్‌ను అరెస్టు చేసి అతని నుంచి రూ.4 లక్షలు విలువైన 66 గ్రాముల బంగారు గొలుసులను, సుజుకి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు అర్బన్ సీఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం, పోలీసు సిబ్బంది జగన్, బర్కతుల్లా, మహేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

పరారీలో ఏఎస్ఐ, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్

కడప (క్రైం), జూన్ 18: ఆర్టీసీ పాత ఆస్పత్రి ఆవరణలో 2023 డిసెంబరు 30న హెల్పర్ డి.ప్రసాద్‌పై కె.రవికుమార్, కిశోర్‌కుమార్ మరో ఐదుగురితో కలిసి దాడి చేసిన సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అరెస్టైన వారిలో రవికుమార్, ప్రశాంత్, మునీంద్ర ఉన్నారు. ఈ కేసులో నిందితులు వరప్రసాద్ ఆలియాస్ ప్రసాద్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్, ఏఎస్ఐ భాస్కర్, కిశోర్‌కుమార్ పరారీలో ఉన్నారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ వెల్లడించారు.

మగ పెద్దపులి పాదముద్రలు సేకరించాం !

మర్రిపాడు ఘటనపై విచారిస్తున్నాం : డీఎఫ్ఓ



విలేకరులకు పెద్దపులి పాద ముద్రలు చూపుతున్న డీఎఫ్ఓ చంద్రశేఖర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 18: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద సోమవారం పెద్దపులి దాడితో కారు ధ్వంసమైందని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) ఏ.చంద్రశేఖర్ తెలిపారు. అయితే మగ పెద్దపులి పాదముద్రలను మాత్రం సేకరించామన్నారు. నెల్లూరులోని నిప్పో సెంటర్ వద్ద గల అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఘటన జరిగిన ప్రాంతంలో సేకరించిన ఆధారాల మేరకు పెద్దపులిని ఢీకొన్న కారు భారీగా దెబ్బతిన్నదంటే... పులికి కూడా తీవ్రగాయలు కావాలి కదా..? అని ప్రశ్నించారు. ఒకవేళ పులి గాయపడితే ఎక్కడికీ కదలలేదన్నారు. కదిరినాయుడిపల్లి పరిసరాల్లో నాలుగు కిలోమీటర్ల వరకు పెద్దపులి జాడలేదన్నారు. పులికి గాయాలైనట్టు ఆధారాలు లేవన్నారు. దీన్ని బట్టి కారు దేన్ని ఢీకొని దెబ్బతిన్నదో విచారిస్తున్నామన్నారు. ఘటనాస్థలంలో మగ పెద్దపులి పాదముద్రలను సేకరించామన్నారు. కారు డ్రైవర్ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అయితే పెద్దపులి సంచారం ఉన్నట్లు నిర్ధారణ అయినందున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేనిదే ఎవరూ అడవిలోకి వెళ్లరాదన్నారు. గతంలో సేకరించిన పాదముద్రలు ఆడ పులివని, ప్రస్తుతం సేకరించినవి మగ పులివని వివరించారు.

అటవీ అధికారుల గాలింపు

మర్రిపాడు, జూన్ 18: కదిరినాయుడుపల్లి అడవిలో పెద్దపులి ఆనవాళ్ల కోసం మంగళవారం అటవీశాఖాధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర అడవిలో డ్రోన్ ఎగర వేసి తద్వారా వీడియో రికార్డు చేశారు. ఈ ప్రమాదానికి కారణం పులిగా నిర్ధారించలేమని ఆత్మకూరు రేంజర్ శేఖర్ తెలిపారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) విజయదుర్గాదేవి

కడప (కల్చరల్), జూన్ 18: కడప నగరం బిల్టప్ సర్కిల్ వద్ద వెలసిన విజయదుర్గా ఆలయంలో మంగళవారం భక్తులు రాహుకాల పూజలు చేశారు. దీపాలు వెలిగించి నవగ్రహపూజలు చేసేందుకు జిల్లా నలు మూలల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజామున పంచామృత అభిషేకం, అనంతరం షోడశోపచార పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు చేశారు. కాగా ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఇసుక కుంభకోణంపై విచారణ జరిపించాలి: ఆర్సీపీ



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రవిశంకరరెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 18 : ఇసుక కుంభకోణంపై విచారణ జరిపించాలని మంగళవారం కడప ఆర్డీఓకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నేతలు వినతిపత్రం అందించారు. వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వద్ద ఆనకట్టకు ముందు ఇసుక మాఫియా అక్రమంగా సుమారు రూ.600 కోట్ల విలువజేసే ఇసుకను అనుమతి లేకుండా తరలించారన్నారు. ఈ సందర్భంగా ఆర్సీపీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఐదు సంవత్సరాల పాటు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వేలాది టిప్పర్లతో ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద ఇసుకను దొంగలించారని ఆ దొంగలను పట్టుకుని వాటిపై విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చా రన్నారు.నాయకులు మగ్బుల్ బాషా, సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, ఖాసిం, గంగన్న, అజయ్, రైతు సంఘం నాయకులు మునిరెడ్డి, ఓబులేసు, రామయ్య పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన వైవీయూ వీసీ



మంత్రిని కలిసిన వైవీయూ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య

కడప (ఎడ్యుకేషన్), జూన్ 18: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైవీయూ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు., రాయచోటిలో వైవీయూ పీజీ సెంటరు స్థితిగతులు వివరించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం యూనివర్సిటీ ప్రగతికి పూర్తి సహకరం అందిస్తామని మంత్రి స్పష్టం చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థ అభివృద్ధికి తాను ఎప్పుడూ ముందుంటానని మంత్రి తెలిపారు. అనంతరం కడప ఎమ్మెల్యే మాధవి, కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డిని టీడీపీ రాష్ట్ర నాయకులు పుత్తా నరసింహారెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందలు తెలిపారు. యూనివర్సిటీ అవసరాలు జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. వారు కూడా సానుకూలంగా స్పందిస్తూ విద్యాలయాల అభివృద్ధికి తమ సాకారం ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలి'



జిల్లా విద్యాశాఖాధికారిణికి వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌యూ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 18:జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్, నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. బస్సు ఫీజు యూనిఫాం, డెవలప్‌మెంటు ఫీజు, బుక్స్ ఇలా పెద్ద మొత్తంలో దండుకుంటూ విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను నిలువుదోడీ చేస్తున్నారన్నారు.ఇలాంటి పాఠశాలలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీధి దీపాల ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన వీధిదీపం

కమలాపురం రూరల్, జూన్ 18: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేశారు. గతంలో కొన్ని చోట్ల వీధిలైట్లు వెలగలేని పరిస్థితి. అయితే నూతన ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా మున్సిపల్ కమిషనరు రాముడితో మాట్లాడి పట్టణంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించారు. దీంతో పలు కాలనీల్లో వెలుగులు వచ్చాయి. అదే విధంగా నగర పంచాయతీ పరిధిలో పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాల్వలు, పూడికలు తీసేందుకు కృషి చేస్తున్నారు. వర్షాకాలంలోనీళ్ల రోడ్లపై నిలుస్తూ పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తోంది. దీంతో కాల్వలో పూడిక తీయించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అలాగే ప్రతి ఇంటికీ మంచి నీరు ఇవ్వాలని సంకల్పించారు. ఈ ఉద్దేశ్యంతో మంచినీటిని సరఫరా చేసే విధంగా అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అలాగే నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా పట్టణంలోని పలు చోట్ల విద్యుద్దీపాలు వేయడం ప్రారంభించారు. కమలాపురం నగర పంచాయతీని మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd. Proddatur branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Araveti Narasimha Reddy** S/o T. Harinatha Reddy resident at D.no:2/54-A, Aravetipalli, Hamlet of Machanur, Pendlimarry Mandal, YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the ragard. **SHEDULE OF THE PROPERTIES** : Kadapa Dt. Kadapa Rural Sub District, Kadapa City, within Kadapa Municipal Corporation, Corporation Ward No. 96, Utukur **BOUNDARIES** : EAST : Site of Araveti Harinatha Reddy, WEST: House Door No. 96/226 of Guthireddy Venkata Subba Reddy, NORTH: Rastha, SOUTH: House of Obulamma

Yours faithfully
SHIAK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



విలేజ్ క్లినిక్ ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న డీపీఎంఓ డాక్టర్ శశిభూషణరెడ్డి తదితరులు

లింగాల, జూన్ 18: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డీపీఎంఓ డాక్టర్ శశిభూషణరెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని పార్నపల్లెలో విలేజ్ క్లినిక్‌ను డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సూత్రాలను, వ్యక్తిగత పరిశుభ్రత ప్రయోజనాలను వివరించాలన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్లోని 30 మంది కిశోర బాలికలకు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని గుర్తించేందుకు రక్తపరీక్షలు చేశారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తల్లీబిడ్డ సంరక్షణ కోసం అంగన్వాడీలకు సూచనలిచ్చారు.
అనంతరం విలేజ్ క్లినిక్ ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రమేష్‌రెడ్డి, డీపీహెచ్‌ఎన్ఓ అరుణ, డీపీఓ కుమార్‌నారాయణ, సీహెచ్ఓ శివరామ్, పీహెచ్ఎన్ కుసుమకుమారి, సూపర్వైజర్ హసియాబేగం, తదితర సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలశాభిషేక మహోత్సవాలు

కడప (కల్చరల్), జూన్ 18: దేవునికడప లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 19 నుంచి 21 వరకు శ్రీవారికి సహస్ర (1008) కలశాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా 19 సాయంత్రం 5.30 గంటల నుంచి భగవద్విజ్ఞాపనము, విష్వక్సేనారాధన, సహస్రకలశాభిషేక సంకల్పం, రక్షాబంధనం, అంకురార్పణం, వాస్తుయాగం, అఖండ దీప స్థాపనం, 20వ తేదీ ఉదయం 7.30 గంటల నుంచి చతుస్థానార్చన, సహస్రకలశ అధివాసం, పారాయణములు, సాయంత్రం 5 గంటల నుంచి సహస్ర కలశ వాహనారాధనములు, 21వ తేదీ ఉదయం 7 గంటల నుం చి సహస్ర కలశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, అలంకారం, సాయంత్రం 5కు తిరుమలేసుని గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. కావున భక్తులందరూ హాజరుకావాలన్నారు.

'ఉద్యోగాలిచ్చి విధుల్లోకి తీసుకోవాలి'

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 18: ఉద్యోగాలిచ్చి విధుల్లోకి తీసుకోవాలని దరఖాస్తుదారులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కడప రిమ్స్ ఆసుపత్రి మెడికల్ కాలేజ్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులు హరి, కార్తీక్, నాగరాజు, జ్యోతి, రాజశేఖర్, అశోక్, కుమార్ మాట్లాడారు. కడప, పులివెందుల క్యాన్సర్, మెంటల్ ఆసుపత్రులలో వివి ధ రకాల ఉద్యోగ నియామకాల కోసం 2023 డిసెంబర్ 14న నాటి ప్రభుత్వం కంబైన్డ్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఆ మేరకు పారామెడికల్, అనస్థీనియా రేడియాలజీ టెక్నికల్ పోస్టుల భర్తీకి గత మార్చి 5న ఎంపిక జాబితా కూడా సిద్ధమైందన్నారు. అయితే ఇంతవరకు అతీగతీ లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగాల నియామకానికి వీలుగా గత మార్చి 12న సర్టిఫికేషన్‌ల వెరిఫికేషన్ కూడా పూర్తికాబడిందన్నారు. ఆ వెంటనే తమకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు నియామకాలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

దోమల నివారణకు మలాథియన్ పిచికారీ

చక్రాయపేట, జూన్ 18: దోమల నివారణకు మలాథియన్ మందు పిచికారీ చేసినట్లు సబ్ యూనిట్ అధికారి ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం చక్రాయపేటలోని ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మలేరియా, డెంగ్యూ రా కుండా ఉండటానికి పిచికారీ చేశామన్నారు. అలాగే పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డన్లు కేశవులు, రాజాబాబు, సీహెచ్ఓ వెంకటరామిరెడ్డి, ఏఎన్ఎమ్ మెహతాజ్, ఆశా వర్కర్లు రాణి, భూదేవి పాల్గొన్నారు.

సమస్తం.. అస్తవ్యస్తం..!

వర్షాలతో రోడ్లపై నీటి ప్రవాహం ● కాలువల్లో పేరుకున్న వ్యర్థాలు ● ఇబ్బందుల్లో ప్రజలు

ప్రొద్దుటూరు, జూన్ 18 : ప్రొద్దుటూరు లో గంట పాటు వాన నిలిచి కురిసిందంటే చాలు రోడ్లన్నీ జలమయం అవుతాయి. దీంతో పట్టణంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా కాలువల్లో ప్రవహించాల్సిన నీళ్లన్నీ రోడ్లపైకి రావడంతో వ్యర్థాలు రోడ్లపైకి వచ్చి కంపు కొడుతున్నాయి. దీంతో రోగాలు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఇందుకు కాలువల్లో పూడిక పేరుకపోవడం కారణం. ఇందువల్ల ప్రతి సారి వర్షం వస్తే చాలు రోడ్లంతా జలమయమవుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా వుండటంతో ఈ సమస్య శాశ్వతంగా వెంటాడుతున్నది. ఓపెన్ డ్రైన్‌ల వల్ల వ్యర్థాలన్నీ ఇంటింటి కసువు సేకరణలో అందించకుండా కాలువల్లో వేస్తున్నారు



గాంధీరోడ్డులో వర్షపునీరు



శివాలయం రోడ్డులో ప్రొద్దుటూరు చానల్లో వ్యర్థాలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

.దీంతో ఎక్కడిక్కడ డ్రైన్‌లలో చెత్తా చెదారం, వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. ప్రధాన డ్రైన్‌లకు మెస్‌లు వేయకపోవడం ఇందుకు ప్రధాన కారణం. అంతే కాకుండా రోడ్లపై వ్యర్థాలను వేసే వారిపై జరిమాన విధించాల్సి ఉంది. వార్డుకు ఒక శానిటరీ సెక్రటరీ వున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వారు పరిశీలించే పనులు చేయడం లేదు. కొందరు అవి మా విధులు కావు మేమే ఆఫీసు విధులు మాత్రమే నిర్వహిస్తామని ఆఫీసులకే పరిమితమౌతున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పర్యవేక్షణ కొరవడింది

యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు..: వర్షాలు రోజు కురుస్తుండటంతో నీళ్లు రోడ్లపై నిలబడి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో యుద్ధ ప్రాతిపదినక ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపడతున్నారు. కొర్రపాడు రోడ్డులో పెట్రోల్‌బంకువద్ద నీళ్ళు నిలబడుతుండటంతో అక్కడ నీళ్లు వెళ్ళేందుకు పనులు చేపట్టారు. అలాగే శివాలయం రోడ్డులోని వైశ్యలాడ్జి పక్కన ప్రొద్దుటూరు చానల్‌లో పూడిక తీత పనులు చేపట్టారు. గాంధీరోడ్డులో ప్రొద్దుటూరు చానల్‌లో అక్కడక్కడ మ్యాన్ హోల్‌ల్లో పూడికతీత పనులను చేపట్టి వర్షం నీళ్ళు కాలువ ద్వారా వెళ్లేందుకు మార్గం క్లియర్ చేస్తున్నారు. వర్షం నీళ్ల ఎక్కడా రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నేడు వీరయ్యస్వామి ఉత్సవాలు

చాపాడు, జూన్ 18: మండలంలోని భద్రిపల్లె గ్రామంలో ఈనెల 19న బుధవారం అవధూత వీరయ్య స్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. స్వామివారికి ఆకుపూజ, పుష్పాలంకరణ, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నదానం చేస్తున్నారు. బుధవారం రాత్రి సంకీర్తన, చింతామణి నాటకం, భజన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ విద్యార్థులు

మైదుకూరు, జూన్ 18 : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణి ప్రకాష్ ఆధ్వర్యంలో క్రీడా మైదానంలో మొక్కలు నాటగా, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ఆవశ్యకత, వాటి సంరక్షణపై ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సురేంద్ర, ఉపాధ్యాయులు మునెయ్యగోశెట్టి రామమోహన్, సూర్యనారాయణరెడ్డి,వెంకటేశ్వర్లు, పద్మనాభయ్య పాల్గొన్నారు.

పేదవారి జీవితం మార్చేదే 'విశ్వకర్మయోజన'

పోరుమామిళ్ల, జూన్ 18 : పేదవారి జీవితం మార్చి బంగారు భవిష్యత్తు అందించేదే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకమని ఎస్‌బీఐ రాజంపేట రీజనల్ మేనేజరు మురళీనాయక్ అన్నారు. మంగళవారం రంగసముద్రం స్టేట్‌బ్యాంకులో విశ్వకర్మ యోజన పథకం రుణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజంపేట చీఫ్ మేనేజరు జాఫర్‌మొహిద్దీన్ రంగసముద్రం స్టేట్‌బ్యాంకు మేనేజరు నరేంద్ర, ఫీల్డ్ ఆఫీసరు పీరయ్యపాల్గొన్నారు.

'ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: విద్యాశాఖలో భారీ అవినీతి అక్రమాలకు పాల్పడిన ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రమేష్ పేర్కొన్నారు. డీఈవోగా ఉన్న రాఘవరెడ్డి ఉపాధ్యాయ బదిలీల్లో ఉపాధ్యాయుల నుంచి అయిదారు లక్షలు వసూలు చేశారని, అంతేకాక మహిళలపట్ల అసభ్యంగా మాట్లాడారన్నారు. ఆయన మాట్లాడిన ఆడియో వెలుగులోకి వచ్చినా ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అయ్యారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బుధవారం చలో విజయవాడ నిర్వహిస్తున్నామని, అక్కడ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

నేడు ఉచిత థైరాయిడ్ పరీక్ష

బద్వేలు, జూన్ 18: పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులో ఉన్న బంగారు శీనయ్య హాస్పిటల్‌లో బుధవారం ఉచిత థైరాయిడ్ పరీక్షలు చేయుచున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు శీనయ్య తెలిపారు. అవసరమైన వారు ఈ ఉచిత థైరాయిడ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9000265511నంబరును సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జమ్మలమడుగు, జూన్ 18: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధైర్యం సూచించారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని పెన్షనర్ల భవనంలో వీఆర్‌ఏలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు. జమ్మలమడుగు పెన్షనర్స్ భవనంలో జరిగిన వీఆర్‌ఏల సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు.

పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి కన్వీనర్ నాగరాజు మంగళవారం ఎంఈవో శోభారాణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. విద్యాశాఖాధికారులు తనిఖీ చేసి నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

పోరుమామిళ్ల, జూన్ 18 : విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐజిల్లా అధ్యక్షుడు రవి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాహక్కుచట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం స్పందించలేదన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, జూన్ 18: జమ్మలమడుగులో సార్వత్రిక ఎన్నికల నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జమ్మలమడుగులోని ఆర్డీవో శ్రీనివాస్ చాంబర్ నందు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఆదినారాయణరెడ్డికి సమస్యలు తెలుపుతున్న అంగన్‌వాడీవర్కర్లు

కొండాపురం, జూన్ 18: మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం జమ్మలమడుగులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిని కలిశారు.ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు వారు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.మండలంలో కొన్ని కేంద్రాలకు భవనాలు లేవని, అంగన్‌వాడీ సెంటర్లలో పలు సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి,తారాదేవి,సులోచన, తులసి,పద్మావతి, వెంకటసుబ్బమ్మ,రాణి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర రామన్నకు టీడీపీ నేతల ఘన స్వాగతం



బ్రహ్మంగారిమఠం, జూన్ 18: టీడీపీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి రాష్ట్రంలో పరిపాలన అందిస్తున్న సందర్భంగా కళ్యాణదుర్గం వాసి జి.రామన్న యాదవ్ అమరావతికి సైకిలు యాత్ర 16న ప్రారంభించి 18 తేదీ బ్రహ్మంగారిమఠానికి చేరుకున్నారు. మండల టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తదితరులు టీడీపీ నేతలు రామన్నను ఘనంగా స్వాగతం పలికి శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పట్టాభిరామం, మేకల సుధాకర్, సర్పంచ్ నారాయణ, చిలమల నాగయ్య, సుబ్రమణ్యం, పూజాశివ యాదవ్, రామక్రిష్ణయాదవ్, రమణ, ధర్మనాయుడు, రాజశేఖర్, సురేశ్, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం మెడికల్ యూనియన్ నాయకుడు రాజన్న చందన ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన ఎఫ్‌ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు, శానిటరీ సిబ్బందికి కాంట్రాక్టర్ నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడంలేదన్నారు. జీతాలు లేక వారు కుటుంబాలను పోషించుకోవడానికి అవస్థలు పడుతున్నారని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి పీఎఫ్ డబ్బులను కాంట్రాక్టర్లు సరిగా చెల్లించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లత, రాజమ్మ, ప్రమీళ పాల్గొన్నారు.

'చేసిన పనులకు త్వరగా బిల్లులు చెల్లించండి'



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

బద్వేలుటౌన్, జూన్ 18 : మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులకు రూ.130కోట్ల 60 లక్షల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధుల్లో 30కోట్ల రూపాయల పనులు మాత్రమే చేసినప్పటికీ ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని, త్వరితగతిన చెల్లించాలంటూ మంగళవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కు టీడీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, మిత్తికాయల రమణ కమిషనర్ క్రిష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పలువార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు చేసినప్పటికీ క్వాలిటీ రిపోర్టు సక్రమంగా ఉన్నా, బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడ మేకాకుండా వాటిలో 20శాతం మాత్రమే బిల్లులు చెల్లించడంతో సబ్‌కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు టీడీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, బెనర్జీ పాల్గొన్నారు.

రేపు భూముల కౌలుకు వేలం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: శివాలయం వీధిలో ఉన్న సుంకు వెంకటసుబ్బయ్య సత్రం భూములకు గురువారం ఉదయం 11 గంటలకు సత్రం కార్యాలయంలో కౌలు వేలం పాట నిర్వహిస్తామని ఈవో రామచంద్రాచార్యులు పేర్కొన్నారు. రామేశ్వరం పొలం, మాలేపాడులో ఉన్న 26వ నంబరు సర్వేలో ఉన్న 162.17 ఎకరాల భూమికి సంబంధించి మూడేళ్ల కాలానికి వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.10 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం పాట దక్కించుకున్నవారు సంవత్సరంపాటు గుత్తను వెంటనే చెల్లించాలని సూచించారు. ఇతర వివరాలకు సుంకు సత్రంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సోమేశ్వరదేవాలయానికి రూ.8.08లక్షలు ఆదాయం

రాజుపాలెం, జూన్ 18: మండల పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన సోమేశ్వర ఆలయానికి భూముల కౌలు వేలం పాటలో రూ.8.08లక్షలు ఆదాయం వచ్చినట్లు ఇన్‌స్పెక్టరు నరసింహసింగ్, ఈవో రామచంద్రచార్యులు తెలిపారు. మంగళవారం టంగుటూరు గ్రామంలోని దేవాలయంలో వేలంపాట నిర్వహించిన వేలం పాటలో దేవాలయానికి భారీ ఆదాయం వచ్చింది. ఈ వేలం పాటలో గ్రామ టీడీపీ నాయకులు మానికింది ఖాదర్‌బాషా, కందుకూరు నడిపన్న, కాకర్ల సంజీవరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, శివశంకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, గుద్దేటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ముద్దనూరు జూన్18: దోమల వ్యాపించకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య పేర్కొన్నారు. మండల పరిధి దేనేపల్లి, బొందలకుంట గ్రామాల్లో మలేరియా సబ్ యూనిట్ బృందం పర్యటించింది. అందులో భాగంగా మురికి నీటి కుంటలు, వాటర్‌ట్యాంకులు, రోడ్డుపై వేసిన వ్యర్థాలను పరిశీలించారు. ప్రతి ఇంటి ముందు పరిశుభ్రత పాటించాలని ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయమని నోటీసులివ్వడం దారుణం



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి సమస్యలు విన్నవించుకుంటున్న బాధితులు

ప్రొద్దుటూరు,జూన్ 18 : రామేశ్వరం పెన్నానది ఒడ్డున వున్న ఫారెస్టు భూముల్లో అనేక సంవత్సరాలుగా ఆవాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నామని నేడు ఆ భూములల్లో ఆవాసాలు ఖాళీ చేయాని ఫారెస్టు అధికారులు నోటీసులివ్వడం దారుణమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి బాధితులు విన్నవించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని రామేశ్వరం ఫారెస్టు భూములల్లో ఆవాసాలున్న వారు కలిశారు. తమకు నోటీసులు ఇచ్చిఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్ళాలని ఆవేదన చెందారు. ఇందుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తాను ఫారెస్టు అధికారులతో మాట్లాడుతానని నోటీసులు తీసుకోండి ఏమీ కాదన్నారు. ఎవ్వరూ మిమ్మల్ని బలవంతంగా ఖాళీ చేయించలేరని అందుకు తనది హామీ అని చెప్పారు.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఘన సన్మానం



పుట్టా సుధాకర్‌యాదవ్‌తో మాట్లాడుతున్న బీమఠం మండల నేతలు

బ్రహ్మంగారిమఠం, జూన్ 18 : మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల నేతలు ముదుమాల పోలిరెడ్డి, శ్రీయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో చౌదరివారిపల్లె, రేకలకుంట్ల, బి.మఠం టీడీపీ నాయకులు తదితరులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రొద్దుటూరులో ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సౌదరివారిపల్లె, రేకలకుంట్ల, బీ మఠం టీడీపీ నేతలు పాల్గొన్నారు.



చాపాడు..:మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు మంగళవారం ప్రొద్దుటూరులోని ఆయన స్వగృహంలో వెలుగు ప్రొద్దుటూరు డివిజన్ కోఆర్డినేటర్ లావణ్య చాపాడు, దువ్వూరు ప్రాజెక్టు మేనేజర్లు వెంకటరమణ, శ్రీధర్, సీసీలు సుబ్బరత్న, రాజా, హరి శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. బొకేలు కూడా ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్డ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మార్తల నరసింహారెడ్డి, సుదర్శన్, వీరశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, అక్బర్, ఓబులేసు, సుబ్బరాయుడు, అక్బర్ సలీం, తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఇష్టానుసారంగా విధుల నిర్వహణ

సమయపాలన పాటించని తహసీల్దారు కార్యాలయం సిబ్బంది

ఖాజీపేట, జూన్ 18: ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సేవలు అందించాల్సిన అధికారులు కార్యాలయాలకు ఇష్టం వచ్చినట్లు రావడం, పోవడం జరుగుతోంది. ఇదేమని అడిగితే వారి పనులు ఆపి ఇష్టం వచ్చినట్లు తిప్పుతుంటారు. గత అయిదు సంవత్సరాలుగా వారు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. ఖాజీపేట తహసీల్దారు కార్యాలయానికి మంగళవారం 11 గంటలు అయినా ఒక్కరు అధికారులు రాలేదు. ఆ తర్వాత ఒక్కొక్కరు కార్యాలయం చేరుకున్నారు. రెండు రోజులుగా వరుస సెలవులు రావడంతో విద్యార్థులు సర్టిఫికెట్లకోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని కార్యాలయానికి సరైన సమయంలో వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు కోరారు. తహసీల్దారు వెంకటలక్ష్మిని వివరణ కోరగా డిప్యూటీ తహసీల్దారు సెలవుపై వెళ్లడం జరిగిందని, ఎన్నికలు కావడంతో ఆఫీసు బాధ్యతలు అప్పగించారన్నారు. కానీ ఏ అధికారి అయినా సమయానికి రాకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాళీగా ఉన్న ఆర్ఐ కుర్చీ



సిబ్బంది రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి సన్మానం చేస్తున్న మెప్మా ఆర్పీలు

ప్రొద్దుటూరు, జూన్ 18 : మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని మెప్మా రిసోర్స్ పర్సన్ అధ్యక్షురాలు తనికంటి లక్ష్మి పేర్కొన్నారు. మంగ్లవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని మెప్మా ఆర్పీలు కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మాఆర్పీలకు ఎస్ఎల్ఎఫ్ ద్వారా జీతాలు కాకుండా నేరుగా జీతాలు బ్యాంకు ఖాతాలో వేయాలని కోరారు.ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ త్వరలో మెప్మా ఆర్పీలు, మహిళా స్వయం సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

రాజుపాలెం మండలంలో 88.2 మి.మీ వర్షపాతం

రాజుపాలెం, జూన్ 18: రుతుపవనాల ద్రోణి ప్రభావంతో మంగళవారం తెల్లవారుజామున మండలంలో 88.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు రాజుపాలెం గ్రామం నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే దారిలో ఉన్న మడువంక ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్డుపై నిర్మించిన కాజ్‌వేపై వర్షం నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులకు కొంత మేర ఇబ్బందులు కలిగాయి. రైతన్నలు ఖరీఫ్ పంటలు సాగు చేసుకునేందుకు మంచి అనువైన వర్షాలు పడుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నరు. అటు నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతలోంలో కురిసిన వర్షానికి రాజోలి ఆనకట్ట నుంచి కుందూలోకి 4040 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



పంట పొలాల్లోపారుతున్న వర్షం నీరు

హోంమంత్రిని కలిసిన డాక్టర్ రాజశేఖర్



బద్వేలు, జూన్18 : రాష్ట్ర హోం వంగలపూడి అనితను మంగళవారం బద్వేలుకు చెందిన టీడీపీ నాయకుడు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. చంద్రబాబు పాలన రాబోయే రోజుల్లో ఎంతో బాగుటుందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని రాజశేఖర్ కొనియాడారు. అలాగే అనిత ఆ పదవికే వన్నె తెస్తారని ఆయన ఆకాంక్షించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: రూరల్ పరిధిలోని నరసింహాపురంలో ఉన్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలను నిర్వహించారు. పూజలు అనంతరం పట్టువస్త్రాలు, వెండి కవచాలు, రంగు రంగుల పూలు, గజమాలలు, వడమాలల తో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.